జిందగీ **శివక్షేత్రం**

అక్రూర చక్రధరీయం

మన పోతన 196 మధురిమ వ భాగం

శుకుడు పరీక్షిత్తుతో.. రాజా! మరునాటి వరు వాత- ప్రాతఃకాలం అక్రూరుడు, బలరామకృ ష్ణులు ఇరువురినీ మధురకు తీసుకురావడానికి తేరు (రథం)లో గోకులానికి చేరుతూ, తెరువు- దారిలో ఈ తీరుగా మనసులో తలచాడు.

ఉ॥ 'ఎట్టి తపంబు సేయబడె? నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో యెట్టి ధనంబు లర్థులకు నీ బడెనో తొలిజామునందు నా యట్టి వివేక హీనునకు నాది మునీంద్రులు యోగదృష్టులం బట్టగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరి జూడగల్గెడిన్'

పూర్వజన్మలో నేను ఎట్టి అపూర్వమైన తపస్సు చేశానో! ఎలాంటి సత్ప్రవర్తనతో శుభకర్మలు ఆచ రించానో! యోగ్యులైన వారికి ఎటువంటి భోగ్య పదార్థాలు- ధనధాన్యాలు దానం చేశానో కదా! నారదాది ఆద్యులైన మునీంద్రుల యోగదృష్టికి కూడా అగోచరుడైన భగవంతుని, ఖగరాజ (గ రుడ) గమనుని, జగత్పతి శ్రీకృష్ణుని- ఏకరూపు డైనా అనేకమూర్తిని, వివేక- తత్త్వజ్ఞాన శూన్యుడ నైన నేను కనగలగడం విచిత్రం, విన విడ్డూరం కాదా? ఆ సారసాక్షుని- పద్మనేత్రుని, అనంతుని ఛద్మ (కపట) బుద్ధితో అంతం చేయడానికి తన సద్మ- గృహానికి (చెంతకు) తెమ్మని నన్ను పంపిన కంసుని వంటి చెలికాడు తలపోయగా నాకు ఇలలో మరొకడు కలడా ? క్రూరుడైన కంసుని పంపుచే నన్ను హింసించడానికి వచ్చిన తెంపరి (సాహసికుడు), దుర్గార్గుడని వారిజా క్షుడు శౌరి నన్ను కనగానే అనుమానిస్తాడో! లేక తనను మదిలో సదా పదిలంగా నిలుపుకొన్న వాడని తెలిసి యదుసింహుడు భూరి కృపతో అభిమానిస్తాడో! నా భాగ్యం ఎలా ఉందో కదా! ఇలా బహువిధాల నందనందనుని సందర్శనం కోరుతూ సుందరమైన స్యందనం- రథం అధిరో హించి అక్రూరుడు సాయంకాలానికి బృందా వనం సమీపించాడు.

బమ్మెరవారు అందంగా వెలయించిన, గ్రీష్మంలో తెమ్మెర- మలయమారుతం లాంటి పీనుల వించిన ఈ కంద పద్యంలో బృందావన శోభను కన్నులపండువుగా కందాము...

క॥ 'ముందట గనె ఘన చందన
కుంద కుటజ తాల సాల కురవక వట మా
కందన్ వందిత బల గో
విందన్ వికచారుణార విందన్ బృందన్'

శుకుడు... రాజా! అలా వెళ్లి వెళ్లి అక్రూరుడు ఘన- గొప్పవైన చందనం, మల్లె, మొల్ల, తాల- తాడి, మద్ది, గోరంట, మర్రి, మామిడి మున్నగు తరు బృందంతో మనోజ్ఞంగా రాజిల్లుతున్న బృందావనాన్ని కన్నాడు. అది విప్పారిన ఎర్ర తామరల అందాలతో ఒప్పుతోంది. బలరామకృ ష్ణులను వలపులతో అలరించే ఆనందధామంగా విలసిల్లుతోంది. అక్రూరుడు పద్మ అంకుశాది రేఖలు గల, విచ్యుతి (నాశము) లేని అచ్యుతుని పాదముద్రలు తిలకించి పులకించి పోయాడు. అనంతరం బలరామకృష్ణులను గాంచి భక్తి పరవ శుడైనాడు. ప్రేమావేశంలో ఒళ్లు గగుర్పాటు చెందగా, కళ్లలో ఆనంద బాష్పాలు సుళ్లు తిరి గాయి. తేరు నుంచి దూకి, ఇది నా రేని (స్వామి) పాదరజం (ధూళి) అంటూ వ్రజ గోర జంలో తీరుగా- విరజస్కుడై (రజోగుణ రహి తుడై) పొర్లాడాడు. పాదాలకు ప్రణమిల్లాడు. డగ్గుత్తిక వలన తన గోత్ర ప్రవర చెప్పలేక పోయాడు. జీవుల దేహధారణకు ఇది కదా పరమ లాభం. భక్తవత్సలుడు అచ్యుతుడు మక్కువ మీర అక్రూరుని అక్కున చేర్చుకున్నాడు. తాను వచ్చిన కారణం వినిపించగా రామకృ ష్ణులు పక్కున నవ్వారు.

శుకుడు- రాజా! అక్రూరుడు రామకృష్ణులను మధురకు వెంటబెట్టుకు వెళతా డనే వార్త తెలియగానే నెలతలు- గోపికులు కలత చెందారు. తమలో తాము ఇలా తలపోశారు.

శా॥ 'అక్రూరుండని పేరు పెట్టుకొని నేడస్మన్నోవల్లభుం
జిక్రిన్ మాకడ బాపికొంచు నరుగం జర్చించి యేతెంచినా
డక్రూరుండట క్రూరుడీతడు నిజం బక్రూరుడౌనేని, ని
ర్వక్రత్వంబున గృష్ణ బెట్టి తన త్రోవంబో విచారింపడే.'

మా ప్రాణేశ్వరుని- చక్రిని మా నుంచి వేరుచేసే ఈతడు నిజానికి క్రూరుడు. అక్రూరుడే అయితే వక్రత్వం- కుటులత్వం మాని, వారిజాక్షుని తమ వారికి విడిచి తన దారిని తాను వెళ్లాలని కుంద రదనలు అతనిని దూరారు- నిందించారు.

నందగోకుల విహారి హరి మరునాటి సూర్యో దయ వేళ, తత్తరపడుతూ తన వెంట వస్తామని బిత్తర చూపులతో వస్తున్న లోకోత్తర ప్రేమ యోగి నులు- గోప భామినులకు 'మరల వస్తా'నని దూతికల ద్వారా చెప్పించి, మరులు గొల్పి- మాయచేసి వారిని మందకు తరలించాడు. నందాదులు వెంటరాగా అక్రూరుని స్యందనం అధిరోహించి గోవిందుడు సబలుడై మధురకు పయనమయ్యాడు. లేడి కన్నుల ముద్దుగు మ్మలు- అబలలు ఖిన్నలై తేరు కన్నంత మేర కదలక మెదలక బొమ్మల వలె సజల నేత్రాలతో చూస్తూ నిలబడ్డారు.

మార్గమధ్యంలో అక్రూరుడు రామకృష్ణుల అనుజ్ఞ తీసుకొని మనోజ్ఞమైన యమునా జలం లోని 'బ్రహ్మహ్రదం'లో స్నానమాడుతూ, ఆ ఏటి నీటిలో సాటిలేని మేటి సోదరులను- రామ కృష్ణులను దర్శించాడు. అబ్బురపడి వారు యథాప్రకారం రథంలో ఉండటమూ పరికిం చాడు. భ్రాంతి కాదు గదా! అని తిరిగి స్రవం తిలో మునిగాడు. ఈపరి- సారి మరింత ఆశ్చర్యం!

ఉ॥ 'పోషిత బాంధవుండు యదు పుంగవుడా జలమందు గాంచె స
ద్ధ్వాషు సహస్ర మస్తక విభాసిత భూషు నహీశ భూమి భృ
ద్వేషు గృపాభిలాషు బ్రతివీరచమూ విజిగీషు నిత్యసం
తోషు నరోషు నిర్జిత దోషు ననేక విశేషు శేషునిన్'

ఆత్మీయ బంధువులకు ఆపద్బాంధవుడు, యదు పుంగవుడు- శ్రేష్ఠుడూ అయిన గాందినీ సుతుడు అక్రూరుడు, ఆ నదీ జలాలలో అశేష విశేషాలు గల ఆశీవిష- నాగుల ఈశుని ఆదిశేషుని అవలో కించాడు. ఆ వ్యాల (సర్ప) రాజు సద్బాషు- వ్యాకరణ సమ్మతంగా- శాస్త్రీయంగా (పతంజలి రూపంలో) భాషించువాడు, సహస్ర మస్తక విభాసిత భూషు- వేయి తలలపై ప్రకాశించు పలు మణుల విభూషణాలు కలవాడు, అహీశు- ప్రచలాకాలకు (పన్నగాలకు) ప్రభువు, భూమి భృద్వేషు- అచలా (భూమి) భారం వహించు దివ్యవేషధారి, కృపాభిలాషు- కరుణ చూపుట యందు ఎక్కువ మక్కువ కలవాడు అనగా దయార్ద్ర హృదయుడు, ప్రతివీరచమూ విజి గీషు- శత్రుసైన్యాన్ని చిత్తుచేయ కోరువాడు, నిత్యసంతోషు, అరోషు- క్రోధ రహితుడు, నిర్ద ళిత దోషు- నిష్కలంకుడూ అయిన ఆ సర్వరా జును కనురెప్ప వాల్చక దర్శించాడు. ఆ ఆదిశే షుని శయ్యపై పవళించి ఉన్న ఆ అయ్యని, అందాల గనిని, కౌస్తుభ మణిధరుని, వనమా లిని, హరిని, అనాది నిధనుడైన పురుషోత్తముని కని శఫల్కుని తన యుడు అక్రూరుడు భక్తి సంభ్రమా లతో అంజలించి, 'నిన్ను పొగడటా నికి నేను ఏపాటి వాణ్ని? నీ మాయచే ఆపద పొలైనవాణ్ని. అచ్యుతా! అనుగ్రహ బుద్ధితో నా ఆర్తి బాపి నన్ను ఆదరించు' అంటూ సగుణ- నిర్గుణ- ఉభయ సామరస్య పూరితంగా అద్భుతమైన స్తవ- స్తోత్రగానం చేశాడు. భక్తకవి రాజు పోతన తపః పూత- పవిత్ర, కవితా చేతనా సరితలో వెల్లివిరిసిన పుల్ల అబ్జ (చక్కగా వికసించిన పద్మాలనే) స్తోత్ర తల్లజా- శ్రేష్ఠాలలో ఈ 'అక్రూర స్తవం' నిర్వక్రం! భావుక భక్తులకు నిత్యనూతనం!
అక్రూరుడు ఆగకుండా నాగశయనుని ఇంకా ఇలా వినుతించాడు.

మ॥ 'కలలం బోలెడి పుత్ర మిత్ర వనితాగారాది సంయోగముల్
జలవాంఛారతి నెండమావులకు నాసల్ సేయు చందంబునం
దలతున్ సత్యములంచు మూఢుడ వృథా తత్త్వజ్ఞుడన్ నాకు నీ
విలసత్పాదయుగంబు సూపి కరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ!'

'రమానాథా! దాహం తీర్చుకోవడానికి, జల ముల వలె భ్రమ కల్పించే ఎండమావులకు దండ వేసి ఆశపడునట్లు, కలల వంటి పుత్రమిత్ర, కళ త్రాలు, గృహ ఆరామ క్షేత్రాలు- ఇట్టి జంజాటం నిజమని నమ్మే వట్టి మూఢుణ్ని నేను. యథార్థం తెలియని వృథా- మిథ్యా తత్త్వజ్ఞుణ్ని- విపరీత జ్ఞాన ఘనుణ్ని. వందారు (నమస్కరించు భక్తు లకు కల్పవృక్షమా)! ఓ నందపట్టీ! ఇలాంటి నాకు, ప్రకాశించే నీ పాద కెందామర (ఎర్ర కమ లా)లను చూపించి ముదమొంద (ఆనందించు నట్లు) కరుణతో కటాక్షించు'

శుకుడు- రాజా! ఇలా కమనీయ కాళిందీ జలా లలో అక్రూరునకు రమణీ యమైన తన ముందటి- తొల్లింటి రూపం చూపి ఇందీవరశ్యాముడు వంది తుడై అంతర్ధానం చెందాడు. అక్రూరుడు నీటి నుండి వెలువడి వెరగుపడుతూ వచ్చి అరదాన్ని అధిరోహించాడు. అప్పుడు అరవిందనేత్రుడు అతనితో ఇలా పలికాడు- అక్రూరా! జలములు ఎంతో దగ్గరలోనే ఉన్నాయే! తలపోయగా- చూడగా నీవు జలకా(స్నానా)నికి వెళ్లి చాలా సేప యింది. అవని మీదను, ఆకాశంలోనూ లేని వింతలేమైనా నీటియందు నీకు కనువిందు చేశాయా?

త్రివిక్రమ చక్రపాణితో అక్రూరుడు కడు వేడు కతో ఇలా నుడివాడు..

క॥ 'నీలోన లేని చోద్యము
లే లోకములందు జెప్పరీశ్వర! నీటన్,
నేలన్ నింగిని నున్నవె?
నీలో జోద్యంబులెల్ల నెగడె మహాత్మా!'

'భగవంతా! నీలో లేని వింతలు ఏ లోకాల దిగంతాలలో నైనా సుంతైనా ఉంటాయని ఏ గొప్పవారూ చెప్పలేదు. ఇక నీటిలోనూ, నేల మీదా, నింగి యందూ ఉంటాయా? సుచరిత్రా! భవలతా లవిత్రా! (సంసారమనే తీగను తెగన రికే కొడవలి వంటివాడా)! విచిత్రాలన్నీ నీలోనే ఉన్నాయి.' ఇలా అని అక్రూరుడు సాయంకాలా నికి మధురాపురి చేరే విధంగా రథం నడిపాడు. కృష్ణుడు తేరు దిగి అక్రూరునితో 'నీవు రథం తోలుకొని నేరుగా గృహానికి వెళ్లు. మేము వేరుగా, తీరికగా తరువాత వస్తాం' అని పలుకగా శ్వఫల్క పుత్రుడు..

క॥ 'నా యింటికి విచ్చేయుము
నీ యంఘ్రి సరోజరేణు నికరము సోకన్
నా యిల్లు పవిత్రంబగు
శ్రీయుత! నీ భటుని బెద్దసేయం దగదే!'

'ఇందిరా రమణా! ఈ తీరుగ పలుక నీకు తగునా? నీవు నా మందిరా నికి విచ్చేయవలె. యాదవ శిరోరత్నమా! నీ పాదారవిం దాల ధూళి నికరం- సమూహం సోకి నా నికేతనం పావనమవుతుంది. సాద రంగా నిమంత్రిస్తున్న నీ బంటుని- ఈ చంటివా నిని, ఇంటికి వచ్చి ఆ మాత్రం ఆదరింపరాదా?' అంటూ మరీమరీ వేడుకుంటున్న అక్రూరునితో వెన్నుడు- శ్రీహరి ఇలా విన్నవించాడు... 'అ నఘా! అక్రూరా! యదువులకు ఎదవై బల్లెమై మదంతో సంచరిస్తున్న కంసుని కదన రంగంలో మర్దించి ముద మార నీ సద నాన్ని సంద ర్శిస్తా. ప్రస్తుతా నికి తేరు తీసు కుని నీవు మథురాపురికి చేరుకో.'

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

శుకుడు- రాజా! శ్రీకృష్ణుడు ఇట్లు నచ్చచెప్పగా విని అక్రూ రుడు నగరానికి చని, రామకృష్ణులు వచ్చిరని కంసునికి తెలిపి తన గృహానికి వెళ్లాడు. కన్నయ్య అపరాహ్ణంలో అన్న బలరామునితో, గోపన్న లతో కూడి మధురలో ప్రవేశించాడు.

(సశేషం)

శివలీలలు చిత్ర విచిత్రాలు. శివుడి రూపాలు అనంతాలు. లింగరూపంలో ఆద్యంత రహితుడిగా ఆవిర్భవించినా, బేసి కన్నులతో బెదరగొట్టినా, జటలు కట్టిన జుట్టుతో కనిపించినా.. శివుడు సుందరుడు. ఆయన ధరించిన ప్రతిరూపానికీ ఓ విశిష్టత కనిపిస్తుంది. ఏ రూపాన్ని కొలిచినా పరిపూర్ణ అనుగ్రహం వర్షిస్తుంది. శివరాత్రి సందర్భంగా.. లింగమూర్తి ధరించిన బహురూపాలను దర్శించుకుందాం.

మా లింగమూర్తి..
బహురూప దీప్తి

బుధవారం మహాశివరాత్రి

లింగమూర్తి <<<

శివరూపం అనగానే వెంటనే గుర్తొచ్చేది శివలింగం. ఇది పరమేశ్వరుడి నిష్కల రూపానికి ప్రతీక. 'లిం' అంటే సృష్టి. 'గం' అంటే లయం. ఈ చరాచర సృష్టి ఎక్కడినుంచి మొదలై తిరిగి దేనిలో లయమవు తుందో (కలిసిపోతుందో) అదే శివలింగం. ఈ రూపంలో లింగం శివుడైతే, పీఠం పార్వతీదేవి. కనుక శివశక్తుల సమష్టి రూపం ఇది. అంతేగాక ఇందులో త్రిమూర్తులు కూడా కలిసి ఉంటారు. అఖండ విశ్వం లింగరూపమని కొనియాడుతూ 'లింగమధ్యే జగత్ సర్వం' అన్నాయి ఆగమాలు.

కల్యాణ సుందరమూర్తి <<<

పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు ప్రజల్ని పీడించసాగాడు. పార్వతీపరమేశ్వరుల పుత్రుడితోనే తనకు మరణం కలగాలని వరం పొందుతాడు తార కాసురుడు. రోజురోజుకూ పెరిగిపోతున్న అసురుడి ఆగడాలను నిలువరించమని అందరూ శివుణ్ని వేడుకుంటారు. లోకకల్యాణం కోసం పరమేశ్వరుడు హిమవంతుని కుమార్తె అయిన పార్వతీదేవిని పరిణయం చేసుకుంటాడు. అంగరంగ వైభవంగా జరిగిన ఆ వివాహంలో స్వామి కల్యాణ సుందర మూర్తిగా దర్శనమిస్తాడు.

చంద్రశేఖరమూర్తి <<<

లోకానికి వెలుగునిచ్చే చంద్రుడు ఒకప్పుడు చీక టిలో మగ్గిపోయాడు. తన మామగారైన దక్షుడు ఇచ్చిన శాపం వల్ల రోజురోజుకూ క్షీణిస్తుంటాడు. భయంకరమైన కుష్ఠ రోగంతో బాధపడుతూ శివుడి గురించి చంద్రుడు ఘోర తపస్సు చేస్తాడు. శివాను గ్రహంతో నెలలో పదిహేను రోజులు పెరిగేట్లూ, పది హేను రోజుల పాటు తరిగేట్లూ వరం పొందుతాడు. అంతేకాకుండా, ఒక రేఖగా ఎప్పటికీ తరుగుదల లేకుండా శివుడి శిరస్సు మీద ఉండే భాగ్యాన్నీ పొందుతాడు. అప్పటినుంచీ శివుడు చంద్రశేఖర మూర్తిగా నీరాజనాలు అందుకుంటున్నాడు.

సోమస్కందమూర్తి <<<

తారకాసుర సంహారం కోసం పరమేశ్వరుడు తన రేతస్సును అగ్ని దేవుడికిచ్చి కాపాడమన్నాడు. అగ్ని దానిని తట్టుకోలేక ఒక రెల్లుగడ్డి వనంలో వదిలిపెడ తాడు. ఆ శరవనంలో స్కందుడు జన్మిస్తాడు. అతణ్ని ఆరుగురు కృత్తికలు పెంచుతారు. అనం తరం నంది వచ్చి స్కందుడిని కైలాసానికి తీసుకువెళ్ల తాడు. తన కుమారుడికి జన్మ రహస్యం (తారకాసు రుని సంహరించాలని) చెప్పి, దేవతల సేనానాయ కుడిగా నియమిస్తాడు. పార్వతీ సమేతుడై స్కంద మూర్తిని మధ్యలో ఉంచుకుని అందరికీ దర్శనమి స్తాడు శివుడు. అదే సోమస్కందమూర్తి రూపం.

అర్ధనారీశ్వరమూర్తి <<<

పార్వతీపరమేశ్వరులు ఇద్దరూ ఒకే రూపం గలవా రనీ, వారిద్దరూ వేర్వేరు కాదనీ తెలిపిన రూపం ఇది. పూర్వం భృంగి అనే భక్తుడు పార్వతీదేవిని విడిచి పెట్టి శివునికి మాత్రమే ప్రదక్షిణలు చేయడంతో పార్వతీదేవి అవమానంతో అలిగి కైలాసం విడిచిపె డుతుంది. గౌతమ మహర్షి ఆశ్రమంలో కఠిన వ్రతం ఆచరించి శివుడి శరీరంలో సగభాగం పొందు తుంది. కుడివైపు శివుడు, ఎడమవైపు అమ్మవారూ ఉండే అర్ధనారీశ్వర మూర్తిని దర్శించుకుంటే భార్యా భర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుందని విశ్వాసం.

హరిహరమూర్తి



హరిహరుల మధ్య భేదం లేదని తెలిపేం దుకు శివుడు ఈ రూపాన్ని ధరించాడు. పూర్వం లోకం అశాం తిగా ఉందని దేవత లంతా విష్ణువు దగ్గ రికి వెళ్తారు. శాంతిని ప్రసాదించేవాడు శంకరుడే అని తెలిపి వారితోపాటు విష్ణుమూర్తి కూడా కైలాసం వెళ్తాడు. అక్కడ వారికి శివదర్శనం కాదు. శివుణ్ని చూడాలని దేవతలంతా ఒక వ్రతం ఆచరిస్తారు. విష్ణుమూర్తి హృదయంలోని అక్షయలింగాన్ని కూడా ఆరాధిస్తారు. చివరికి కుడి వైపు శివుడు, ఎడమవైపు విష్ణువు కలిసి ఉన్న రూపంలో దర్శనమిస్తాడు శంకరుడు. ఆ స్వామి రూపాన్ని దేవతలంతా హరిహరమూర్తిగా ఆరాధిస్తారు.

కిరాతమూర్తి <<<

ద్వాపరయుగంలో అర్జునుడిని శివుడు అనుగ్రహిం చిన రూపం ఇది. పాశుపతాస్త్రం కోసం ఘోర తపస్సు చేస్తున్న అర్జునుడిని పరీక్షించడం కోసం శివుడు ఒక రాక్షసుడిని వరాహంగా మార్చి పంపు తాడు. అది అర్జునుడు తపస్సు చేసుకుంటున్న ప్రాంతానికి వెళ్లి, నానా బీభత్సం సృష్టిస్తుంది. దాన్ని చంపడానికి అర్జునుడు బాణం వేస్తాడు. దగ్గరకు వెళ్లి చూస్తే అక్కడ మరో బాణం కూడా దిగి ఉంటుంది. ఒక బోయవాడు తానే ఈ వరాహాన్ని చంపానంటాడు. తానే చంపానని అర్జునుడు అత నితో వాదనకు దిగుతాడు. వారిద్దరి మధ్య వాదన పెరిగి యుద్ధానికి దారితీస్తుంది. చివరికి అర్జునుడు ఓడిపోతాడు. కిరాతరూపంలో వచ్చింది శివుడని గ్రహించి శరణు వేడతాడు. శివుడు పాశుపతాస్త్రం ప్రసాదిస్తాడు. ఈవిధంగా అర్జునుడిని అనుగ్రహిం చిన శివుడే కిరాతమూర్తి.

జలంధరవధమూర్తి <<<

జలంధరుడు శివుడి మూడోకన్ను నుంచి జన్మిం చాడు. అతణ్ని సముద్రుడు పెంచుకున్నాడు. ఒక సారి శివుణ్ని దర్శించిన ఇంద్రుడు తనకు పోటీ అయిన శత్రువే లేడని విర్రవీగుతాడు. ఇంద్రుడి గర్వాన్ని జలంధరుడు అణచివేస్తాడు. మృత సంజీ వని విద్యతో మరణాన్ని జయించడం తెలుసుకున్న జలంధరుడు మహావిష్ణువు సహా దేవతలందరినీ తన అధీనంలో ఉంచుకుంటాడు. చివరికి శివుడితో తలపడతాడు. పరమేశ్వరుడు జలంధరుణ్ని సంహా రించి లోకానికి శాంతి కలిగిస్తాడు. అలా శివుడు జలంధరవధమూర్తిగా పేరొందాడు.

శరభమూర్తి

హిరణ్యకశిపుడిని సంహరించడానికి విష్ణుమూర్తి నర సింహ రూపం ధరించి అతణ్ని వధిస్తాడు. కానీ, ఆ ఉగ్రత్వాన్ని ఆపడం ఎవరి తరం కాదు. దేవతలు శివుణ్ని వేడితే వీరభద్రుడిని పంపుతాడు. వీరభ ద్రుడు ఎంత కోరినా నరసింహుడు ప్రసన్నం కాడు. చివరికి వీరభద్రుడు అతిభయంకరమైన శరభావ తారం ధరించి నరసింహుణ్ని నిలువరిస్తాడు. శరభ రూపంలో శివుడు రెండు తలలు, ఎనిమిది కాళ్లు, రెండు రెక్కలతో భయంకరంగా దర్శనమిస్తాడు. శర భమంత్రం పఠించినవారికి శత్రు నాశనం కలుగు తుందని ప్రతీతి.

ఏకపాదమూర్తి <<<

ఆయన ఒకే పాదం కలవాడు. త్రిమూర్తులకు మూల మైనవాడు. ప్రళయకాలంలో పరమేశ్వరుడు ఈ అవ తారం ధరించి సృష్టి చేశాడని పురాణ కథనం. ఈయన నుంచే బ్రహ్మ విష్ణువులు ఆవిర్భవించారు. ఏకాదశరుద్రుల్లో ఏకపాదుడు ఒకరు. కొన్నిసార్లు నాలుగు చేతులతో, మరికొన్ని చోట్ల పదహారు చేతు లతో కనిపిస్తాడు. తెలుగునాట కొన్ని దేవాలయాల్లో ఏకపాదమూర్తి రూపం కనిపిస్తుంది. భైరవుడి అవ తారానికి ఈ మూర్తి కొనసాగింపు.

దక్షిణామూర్తి <<<

ఈయన ఆదిగురువు. పూర్వం వేదాలను పరిపూ ర్ణంగా అధ్యయనం చేసినా.. మహర్షులకు ఇంకా ఎన్నో సందేహాలు కలుగుతాయి. వాటిని నివృత్తి చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వారు కైలాసం వెళ్లి శివుణ్ని అభ్యర్థిస్తారు. వారికోసం శివుడు దక్షిణామూర్తి రూపం ధరించి మౌనంతో, చిన్ముద్ర చూపి వారి సందేహాలను తీర్చాడు. ఈయన దక్షిణంవైపు ముఖం ఉంచి మర్రిచెట్టు కింద కూర్చుంటాడు. దక్షిణామూర్తిని ఆరాధించినవారికి విద్య, జ్ఞానం లభిస్తాయి.

... కందుకూరి సత్యబ్రహ్మాచార్య

ఇస్లాం బోధ

పవిత్ర మాసానికి స్వాగతం

ఒకరి తప్పును పెద్దమనసు చేసుకుని క్షమించడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు! అలాగని అసంభవం, అసాధ్యం అంతకన్నా కాదు! తమ మిత్రులతో స్నేహం చెడిందంటే నెలల తరబడి మాట్లాడరు. ఒక్కోసారి సంవత్సరాల తరబడి ముఖాలు చూసుకోరు. కాస్త శ్రద్ధ చూపితే మనసుకు అయిన గాయం కూడా త్వరగానే మానుతుంది. గుండెల్లో గూడుక ట్టుకున్న కల్మషాల మురికిని ఎప్పటికప్పుడు శుద్ధి చేసుకోవాలి. ఎంతటి వారినైనా క్షమించే విశాల హృదయం పెంపొందించుకోవాలి. మన హృదయాలను, మన పాపాలను కడిగేసే ఓ అతిథి మన ఇంటికి రాబోతున్నాడు. ఆ అతిథి మనకు నిగ్రహం నేర్పుతాడు. ఆగ్ర హంపై అదుపు సాధించడం ఎలాగో చెబు తాడు. ఆకలిని అణగదొక్కడం ఎలాగో వివ రిస్తాడు. మనపై మనం అదుపు సాధించడ మెలాగో తర్ఫీదునిస్తాడు. ఆ అతిథి కోసం కోట్లాది మంది ముస్లింలు నెల రోజుల నుంచి ఎదురుచూస్తున్నారు. ఆ అపూర్వ అతిథిని స్వాగతించేందుకు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఆ అనుకోని అతిథి మరెవరో కాదు వరాల వసంతం.. శుభాల మాసం.. పవిత్ర రమజాన్. ఆకాశంలో రమజాన్ నెలవంక కనిపించగానే కోట్లాది ముస్లింల మోములు మెరిసిపోతాయి. గుండెల్లో ప్రేమ ఉప్పొంగుతుంది. కల్మషాలన్నీ కడి గేసుకుంటారు. 'భాయి..భాయి' అని ఒకరినొకరు హృదయాలకు హత్తుకుంటారు. ప్రేమ, దయ, కారుణ్యం పొంగుతాయి. ఒకరిపట్ల ఒకరికి సానుభూతి అలవడుతుంది. నెలరోజుల ఉపవాసాలకు సంసిద్ధులవుతారు. బద్ధ విరోధులను సైతం ప్రేమించే తర్ఫీదు ఈ ఉపవా సాలు నేర్పుతాయి. సహెరీ, ఇఫ్తార్ సందళ్లు ప్రేమ, ఆప్యాయతలకు వేదికలవుతాయి.

మార్చి 2 నుంచి రమజాన్ నెల

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

కథాసుధ

అగ్గిపుల్ల

ఓ గ్రామంలో రాములవారి గుడి ఉంది. ఒకరోజు అక్కడికి వచ్చిన ఉపన్యాసకుడు అరిషడ్వర్గాల గురించి ప్రసంగించాడు. 'కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను అరిషడ్వర్గాలు అంటారు. ఇవి మని షిని ఎంతటి స్థాయికైనా దిగజారుస్తాయి. మనిషి పత నానికి, ప్రకృతి వినాశనానికి కారణమవుతాయి. వీటిని ఎవరైతే కలిగి ఉంటారో వారి మనసు ఎప్పుడు స్వార్థం, సంకుచిత భావాలతో నిండి ఉంటుంది' అని వివరించాడు. ఉపన్యాసం పూర్త య్యాక ఆయన అక్కడినుంచి బయల్దేరబోయాడు. గుడి ముందు అంగడి పెట్టుకుని ఉన్న వ్యాపారి ఆయన దగ్గరికి వచ్చాడు. 'మీరు మీ ఉపన్యాసంలో అనేకసార్లు 'తన కోపమే తన శత్రువు' అని చెప్పారు. అది ఎలా?' అని అడిగాడు. 'నువ్వు ఏం చేస్తూ ఉంటావు?' అని ప్రశ్నిం చాడు ఉపన్యాసకుడు. 'ఈ గుడి ముందు కొబ్బరికాయలు, కర్పూరం, అరటిపండ్లు, సాంబ్రాణి, ఒత్తులు, అగ్గిపెట్టె లాంటివి అమ్ముతూ ఉంటాన'ని బదులిచ్చాడు వ్యాపారి. వెంటనే ఉపన్యాస కుడు 'అగ్గిపెట్టెలోని అగ్గి పుల్లలతో మనం ఏం చేస్తాం?' అని ప్రశ్నించాడు. 'వేరే వాటిని కాల్చడా నికి అగ్గిపుల్లలను ఉపయోగిస్తాం' అని సమాధానం ఇచ్చాడు వ్యాపారి. ఉపన్యాసకుడు చిన్నగా నవ్వి 'అగ్గిపుల్లని గీసినప్పుడు ఏమి జరుగుతుందో గమనించావా?' అని మళ్లీ ప్రశ్నించాడు. 'అం దరికీ తెలిసిందే కదా, మొదట అగ్గిపుల్ల కాలడం జరుగుతుంది' అని తేలికగా చెప్పాడు వ్యాపారి. 'తను కాలకుండా అగ్గిపుల్ల వేరే వాటిని కాల్చగలదా?' అని సూటిగా అడిగాడు ఉపన్యాసకుడు. క్షణం ఆలోచించి 'కుదరదు కాక కుదరద'న్నాడు వ్యాపారి. 'అలాగే కోపమొచ్చిన మనిషి కూడా! మనం కోపంతో ఉన్నప్పుడే.. ఎదుటివారిపై కోపాన్ని వ్యక్తం చేయగలం. అంటే ఎదుటి వ్యక్తికి నష్టం జరగడాని కన్నా ముందే మనకు నష్టం జరుగుతుందన్నమాట. ఇక్కడ మనం తెలుసుకోవ ల్సింది ఏమిటంటే, మాట అన్నవాడు, మాట అనిపించుకున్న వాడు... ఇద్దరూ ఇబ్బంది పడ తారు. అందుకే తన కోపమే తన శత్రువు' అని చెప్పాను అని వివరించాడు ఉపన్యాసకుడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821